సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 4 । జనవరి । 2023



ఆర్‌బీకేల్లో మందుల నిల్వలు
- తగు చర్యలు చేపట్టాలి
- పశుసంవర్థకశాఖ జేడీ వెంకటేశ్వర్లు ఆదేశం

8లో



స్పందన అర్జీలు తక్షణ పరిష్కారం

8లో

కార్గోలో కొత్త పుంతలు!
- ప్రైవేటు లాజిస్టిక్స్‌తోనూ ఒప్పందాలు
- సరకు రవాణాలో ఆర్టీసీ జోన్‌-1 జోరు



8లో

న్యూస్‌రీల్

మూడు ప్రైవేట్ మెడికల్ ల్యాబ్‌లు సీజ్



చింతూరులో ల్యాబ్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

చింతూరు: మండల కేంద్రం చింతూరులో మూడు ప్రైవేటు మెడికల్ ల్యాబ్‌లను తహసీల్దార్ సాయికృష్ణ మంగళవారం సీజ్ చేశారు. ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ ఆదేశాల మేరకు చింతూరులోని ప్రైవేటు మెడికల్ ల్యాబ్‌లను తనిఖీ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో ప్రగతి, ఒమేగా, సేఫ్ ల్యాబ్‌లను సీజ్ చేశామని ఆయన పేర్కొన్నారు. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఐటీడీఏ పీవోకు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో ఆర్‌ఐ దారయ్య, వీఆర్‌వో రామచంద్రం పాల్గొన్నారు.

ఉధృతంగా చలిగాలులు
కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు



అరకులోయలో దట్టంగా కురుస్తున్న పొగమంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం పాడేరు మండలం మినుములూరులో 13 డిగ్రీలు,అరకులోయలో 14.2 డిగ్రీలు, చింతపల్లిలో 15 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.అరకులోయ ప్రాంతంలో ఉదయం 10గంటల వరకు దట్టంగా పొగమంచు కురిసింది. పాడేరు,అరకులోయ ప్రాంతాల్లో మాత్రం పొగమంచు ప్రభావం పెద్దగా లేదు. చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. సోమవారం అర్ధరాత్రి పాడేరు ఘాట్‌లో జల్లులవాన కురిసింది. మంగళవారం మధ్యాహ్నం నుంచి మన్యంలో మబ్బు వాతావరణం నెలకొంది. అరకులోయ ప్రాంతంలో సాయంత్రం తేలికపాటి జల్లులు కురిశాయి.

జాతీయ యువజనోత్సవాలకు పాడేరు విద్యార్థులు



చంద్ర కేశవ



బాలరాజు

పాడేరు రూరల్: జాతీయ యువజనోత్సవాలకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఇద్దరు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ విద్యార్థులు ఎంపికయ్యారు. స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని కర్ణాటకలోని ధార్వాడ్లో ఈనెల 12 నుంచి 16 వరకు యుజనోత్సవాలు జరగనున్నాయి. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం స్పెషల్ తెలుగు విద్యార్థి కె. చంద్రకేశవ, ద్వితీయ సంవత్సరం బీఎస్సీ చదువుతున్న బి. బాలరాజు అనే ఇద్దరు ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఎంపికయ్యారు. వీరిని ప్రిన్సిపాల్ డాక్టర్ వనుము చిట్టాబ్బాయ్, వైస్ ప్రిన్సిపాల్ టీఎన్ రసూల్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జి. గౌరీశంకర్, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన అన్నాచెల్లెలు

రాజవొమ్మంగి: మండలంలోని సూరంపాలెం మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నాచెల్లెలు జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన రెడ్డి రాంబాబు (25), రెడ్డి అక్కమ్మ (23) తీవ్రంగా గాయపడ్డారు. మండలంలోని శరభవరంలోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామం మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. శరభవరం వైపు వెళుతున్న ఆటో ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వీరిని స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు అడ్డతీగల ప్రభుత్వ ఆస్పత్రికి రిఫర్ చేశారు.

మన్యంలో ఉసిరి

- అమ్మకాలు జోరు
- కిలో రూ.60 చొప్పున జీసీసీ కొనుగోలు



మార్కెట్లో అమ్మకానికి సిద్ధం చేసిన ఉసిరి పప్పు



సాక్షి, పాడేరు: జిల్లాలో ప్రధాన అటవీ ఫలసాయంగా పూర్వం నుంచి గుర్తింపు పొందిన ఉసిరికాయలకు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఔషధ గుణాలున్న ఉసిరి చెట్లు జిల్లా వ్యాప్తంగా అటవీ ప్రాంతాల్లో విస్తారంగా ఉన్నాయి. పాడేరు, రంపచోడవరం డివిజన్లలో విస్తారంగా ఉన్న అడవుల్లో పూర్వం నుంచి ఉసిరి చెట్లు ప్రకృతి ప్రసాదినిగా ప్రాచుర్యం పొందాయి. అటవీశాఖ కూడా వన సంరక్షణ సమితులు పరిధిలోని అడవిలో దాదాపు 30ఏళ్ల నుంచి ఉసిరి మొక్కల పెంపకం నిరంతరం చేపడుతోంది. విస్తారంగా ఉన్న ఉసిరిచెట్లకు సీజన్‌లో కాపు అధికంగా ఉంటుంది. ఈ ఫలసాయాన్ని సేకరిస్తున్న గిరిజనులు ఉసిరి కాయలు, పప్పు రూపంలో విక్రయిస్తున్నారు.

మందుల తయారీలో..

తెలుగు రాష్ట్రాలతో పాటు గుజరాత్, ఒడిశా, మహారాష్ట్ర ప్రాంతాల్లోని ఫార్మా కంపెనీలు, ఆయుర్వేద మందుల తయారీదారులంతా ఉసిరిని కాయలు, పప్పు రూపంలో ఏటా భారీగా సేకరిస్తుంటారు. ప్రస్తుతం ఏజెన్సీలో ఉసిరి కాయల సీజన్ కావడంతో గిరిజనులంతా అడవుల్లోని చెట్ల నుంచి కాయలను సేకరించి వాటిని బాగా ఉడకబెట్టి పప్పు రూపంలో తయారు చేస్తున్నారు. బాగా ఆరిన తర్వాత ఉసిరి పప్పును వారపుసంతలతో పాటు గిరిజన సహకార సంస్థకు విక్రయిస్తున్నారు. కిలో రూ.60 గిట్టుబాటు ధరతో ఉసిరి పప్పును గిరిజన సహకార సంస్థ ఈ ఏడాది కూడా కొనుగోలు ప్రారంభించింది.

పోటాపోటీగా..

ప్రైవేటు వ్యాపారులు కూడా వారపుసంతల్లో పోటాపోటీగానే ఉసిరి పప్పును కొనుగోలు చేస్తున్నారు. ఉసిరికాయలను మామూలుగా అమ్ముతుంటే కిలోకు రూ.10 నుంచి రూ.20లు మాత్రమే వస్తుంది. ఉసిరి పప్పు రూపంలో విక్రయించి గిరిజనులకు మంచి ఆదాయం పొందుతున్నారు. అటవీ ఫలసాయంగా గుర్తింపు పొందిన ఉసిరి గిరిజన రైతులకు సిరులు కురిపిస్తోంది. కొంతమంది గిరిజనులు అనంతగిరి, లంబసింగి, పాడేరు ఘాట్ రోడ్లతో పాటు, వారపు సంతల్లో పర్యాటకులకు కిలో రూ.10 నుంచి రూ.20 ధరతో ఉసిరి కాయలను విక్రయిస్తున్నారు

డీఆర్ డిపోలు, సంతల్లో కొనుగోలు



ఉసిరి పప్పును ఏటా జీసీసీ కొనుగోలు చేస్తోంది. ఈ ఏడాది కూడా కిలోకు రూ.60 మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు మొదలు పెట్టాం. ఏజెన్సీలోని అన్ని వారపుసంతలతో పాటు జీసీసీ డీఆర్ డిపోల వద్ద కూడా ఉసిరి పప్పును కొనుగోలు చేస్తున్నాం.

–కె.పార్వతమ్మ, జీసీసీ డీఎం, పాడేరు

మెరుగైన వైద్యసేవలు అందించండి

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- బందపల్లి, ఊట్ల గ్రామాల్లో పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



ఊట్ల గ్రామ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో గ్రామాల్లో ఏర్పాటు చేసే మెడికల్ క్యాంపుల్లో రోగులను గుర్తించి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా బందపల్లి, ఊట్ల గ్రామాల్లో నిర్వహించిన వైద్యశిబిరాలను పరిశీలించారు. శిబిరానికి వచ్చిన గర్భిణులు, చిన్న పిల్లల ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించి, మందులు ఇవ్వాలని సూచించారు. పుట్టిన పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు వేయాలని ఆదేశించారు. చిన్న పిల్లలకు తల్లి పాలు సరిపోతున్నాయా లేదా అనేది తెలుసుకుని తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల పరిధిలో పాఠశాలలను పరిశీలించి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. బందపల్లి గ్రామంలో పక్షవాతంతో అనారోగ్యానికి గురైన వ్యక్తితో మాట్లాడారు. మెరుగైన వైద్య సేవలు కోసం ఆస్పత్రిలో చేర్పించాలని వైద్యాధికారులను ఆదేశించారు. పాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని సూచించారు. బందపల్లి పంచాయతీ పరిధిలో రేషన్ కార్డులు పెండింగ్‌లో ఉన్న వాటికి ఈకేవైసీ చేయించాలని అధికారులను ఆదేశించారు. బందపల్లి, ఊట్ల గ్రామ సచివాలయాల భవన నిర్మాణాలను పూర్తి చేయని వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. రెండు నెలల్లో భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఇంజనీర్లకు సూచించారు. పోడు భూముల పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి 15 రోజుల్లో సర్వే చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఊట్ల గ్రామంలో మంచినీటి సమస్యను గిరిజనులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతిపాదనలు పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

హైవే నిర్మాణానికి నివేదికలివ్వండి

రంపచోడవరం: జిల్లాలో నేషనల్ హైవే 516కు సంబంధించిన నివేదికలను సకాలంలో సమర్పించాలని సంబంధిత ఇంజనీర్లను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, రంపచోడవరం మండలాల తహసీల్దార్లు, అటవీ రేంజ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. హైవేకు సంబంధించి ప్రభుత్వ భూములు, ప్రైవేట్ భూములు, రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ఇళ్లు , విద్యుత్ స్తంభాలు, చెక్‌డ్యామ్‌లు, బోర్ల వివరాలు, నష్టాలను అంచనా వేయాలని ఆదేశించారు. హైవే నిర్మాణానికి సంబంధించి 34 గ్రామాల్లో సభలు ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. హైవేకు 725 ఎకరాలు అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్, సబ్ డీఎఫ్‌వో భరణి పాల్గొన్నారు.

సేవాభావంతో పనిచేయండి

డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా



ఆశా కార్యకర్తలతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా

చింతూరు: వైద్యసిబ్బంది ప్రజలకు సేవాభావంతో సేవలు అందించాలని, తద్వారా ప్రజలకు సిబ్బందిపై నమ్మకం ఏర్పడుతుందని డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా అన్నారు. మంగళవారం ఆయన స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలకు చెందిన సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ 104 ద్వారా సచివాలయ పరిధిలోని ప్రజలకు అందేలా వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్రచికిత్సతో కాన్పు జరిగిన మహిళలను, ఇతర శస్త్రచికిత్సలు చేయించుకున్న వారిని, దీర్ఘకాలిక రోగుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించాలని ఆదేశించారు. మాతా, శిశు మరణాలు సంభవించకుండా వైద్యాధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ముందు జాగ్రత్తగా ప్రతిరోజు బాలింతలను విధిగా సందర్శించాలని, ఏదైనా అనారోగ్య లక్షణాలు కలిగిఉంటే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించాలని ఆయన ఆదేశించారు. కాన్పు నిమిత్తం గర్భిణులను వారం రోజుల ముందే ప్రసూతి కేంద్రాలకు తరలించాలని, పుట్టిన ప్రతి శిశువుకు పూర్తి వ్యాధి నిరోధక టీకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రస్తుతం కోవిడ్–19 వ్యాప్తి నేపథ్యంలో తగిన జాగ్రత్తలు వహించాలని, కోవిడ్ లక్షణాలు కనిపిస్తే ఆర్టీటీ కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. అనంతరం ఆయన తులసిపాక పీహెచ్‌సీని సందర్శించి అక్కడ అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య, నాలుగు మండలాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో వైద్యసేవలు

- చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్
- కోతులగుట్ట సామాజిక ఆరోగ్య కేంద్రం తనిఖీ
- అనుమతులు లేని ప్రైవేట్ ల్యాబ్ సీజ్



ఆక్సిజన్ ప్లాంట్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్ ఖాన్



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

కూనవరం: స్థానిక 30 పడకల ఆస్పత్రి (సీహెచ్‌సీ కోతులగుట్ట)లో పూర్తి స్థాయి వైద్యసేవలు అందిస్తామని చింతూరు ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కోతులగుట్ట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. ఆక్సిజన్ ప్లాంట్లు, ఆపరేషన్ థియేటర్, ఎక్స్‌రే యూనిట్, ఎన్‌ఆర్‌సీ, చిన్నపిల్లల వార్డు, ల్యాబరేటరీ తదితర విభాగాలను సందర్శించారు. అక్కడ అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్ వార్డులను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడారు. రికార్డులను పరిశీలించి నెలవారీ కేసుల వివరాలను వైద్యుల నుంచి తెలుసుకున్నారు. ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, గైనిక్ వైద్య సేవల గురించి ఆయన మాట్లాడారు. వారంలో ఒకటి రెండు రోజులు ఇక్కడ కూడా సేవలు అందించేలా చూడాలని చింతూరు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కోటి రెడ్డిని ఆదేశించారు.

అనుమతులు లేని ల్యాబ్‌పై చర్యలు

అనుమతులు లేని ప్రైవేట్ ల్యాబ్‌లను సీజ్ చేస్తామని ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. జగ్గవరం సచివాలయం పరిధిలో ప్రభుత్వాస్పత్రికి కూత వేటు దూరంలోని రేల రక్తపరీక్షా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. నిర్వహణకు అనుమతులు లేకపోవడంతో ఆయన ఆదేశాల మేరకు తహసీల్దార్ కె. అనసూయ ల్యాబ్‌ను సీజ్ చేశారు. రక్తపరీక్ష కేంద్రం నడుపుతూ గిరిజనులను మోసగిస్తున్న ఆర్ఎంపీపై చర్యలు తీసుకోవాలని ఏపీఎస్పీ నాయకుడు కుంజా అనిల్ ఫిర్యాదు చేవారు. దీనిపై పూర్తి వివరాలు సేకరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూనవరం సీహెచ్‌సీ జనరల్ సర్జన్ డాక్టర్ జె.భాస్కర్, సూపరింటెండెంట్ వినీత, వైద్యాధికారులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే

- రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి
- వైఎస్సార్ పింఛను కానుక పంపిణీ
- పాల్గొన్న పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు పాపారాయుడు



కొత్తాడ సభలో మాట్లాడుతున్న నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కర్రి పాపారాయుడు



కొత్త పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం: పాదయాత్ర, ఎన్నికల సమయాల్లో పేద ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మంగళవారం కొత్తాడ పునరావాస కాలనీలో వైఎస్సార్ పింఛన్ కానుక పథకంలో దేవీపట్నం, గంగవరం మండలాలకు చెందిన 397మంది కొత్త పింఛన్ లబ్ధిదారులకు ఆమె, పార్టీ పరిశీలకుడు కర్రి పాపారాయుడు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ప్రసంగించారు. గిరిజనుల అభ్యున్నతికి , గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సీఎం ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. వీటిని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రంపచోడవరం నియోజకవర్గంలో 50వేల మందికి కొండపోడు పట్టాలు ఇచ్చిన ఘనత వైఎస్సార్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. సచివాలయల కన్వీనర్లు ప్రభుత్వ పథకాలు మరింత ముందుకు తీసుకువెళ్లేలా కృషి చేయాలన్నారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు కర్రి పాపారాయుడు మాట్లాడుతూ గ్రామ సచివాలయ, గ్రామవలంటరీ వ్యవస్థను రాష్ట్ర ముఖ్యమంత్రి మానసపుత్రికగా అభివర్ణించారు. ఈ వ్యవస్థ ద్వారా ద్వారా ప్రతీ పథకం అవినీతికి తావులేకుండా గడపగడపకు అందుతోందన్నారు. గంగవరం, దేవీపట్నం మండలాల్లో నియమించిన కన్వీనర్లను ఆయన ప్రకటించారు. ఎమ్మెల్యే ధనలక్ష్మి, కర్రిపాపారాయుడులు, ప్రజా ప్రతినిధులకు కొత్తాడ సర్పంచ్ కామరాజుదొర ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ చవలం సంకురుదొర , గ్రామసచివాలయ కార్యదర్శి అజయ్, సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు పల్లాల కృష్ణారెడ్డి, కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యులు బేబీ రత్నం, సత్యవేణి, ఎంపీడీవోలు బి.శ్రీనివాసులు, డీఎస్.రత్నకుమారి, ఎస్ఐ చినబాబు, వైస్ ఎంపీపీలు రామతులసి, గంగాదేవి, గారపాటి మురళీ కృష్ణ, పార్టీ కన్వీనర్లు అప్పలరాజు పాల్గొన్నారు.

5,398 మందికి కొత్త పింఛన్లు

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



వైఎస్సార్ పింఛన్ల కానుక పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, అధికారులు

సాక్షి,పాడేరు: వైఎస్సార్ పింఛన్ కానుకలో కొత్తగా జిల్లాలో 5,398 మందికి కొత్త పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ పింఛన్ల కానుకకు సంబంధించి ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అలాగే కొత్త పింఛన్‌దారులకు రూ.2750 చొప్పున మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రాజమహేంద్రవరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని ఎమ్మెల్యేతో పాటు అధికారులు,లబ్ధిదారులు వీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో అర్హులైన పింఛనుదారులకు అన్యాయం జరిగిందన్నారు. అప్పటిలో 39 లక్షల మంది పింఛనుదారులు ఉండగా, తమ ప్రభుత్వ పాలనలో 66.5 లక్షల మంది అర్హులకు పింఛన్ల పంపిణీ జరుగుతుందన్నారు.జిల్లాకు సంభ ంధించి 1,25,460 మందికి రూ.34.90 కోట్ల మేర పింఛను సొమ్మును ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. పింఛన్ల నిబంధనలపై టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు తప్పుడు ప్రచారాలు చేయడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్, వ్యవసాయ సలహామండలి అధ్యక్షురాలు సరస్వతి, డీఆర్‌డీఏ పీడీ మురళి, వైఎస్సార్‌సీపీ మహిళా నేత కోడా సుశీల పాల్గొన్నారు.

సాడేకు సురక్షిత తాగునీరు

రూ.1.5 లక్షలతో సోలార్ తాగునీటి పథకానికి మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



కుళాయిల ద్వారా తాగునీటిని సేకరిస్తున్న గిరిజన మహిళలు, చిత్రంలో ప్రజాప్రతినిధులు

సాక్షి,పాడేరు: జి.మాడుగుల మండలం సాడేకు గ్రామానికి సురక్షిత తాగునీరు మంగళవారం అందుబాటులోకి వచ్చింది. ఊటనీరే తాగునీరు శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి స్పందించారు. గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. జలజీవన్ మిషన్ నిధులు రూ.1.5 లక్షలు కేటాయించారు. యుద్ధప్రాతిపదికన కొత్త మోటార్ ఏర్పాటు చేశారు. పైపులైన్లకు మరమ్మతులు చేపట్టారు. మంగళవారం సోలార్ నీటి పథకాన్ని ఎంపీటీసీ ఈశ్వరరావు, సర్పంచ్ రాంబాబు పునఃప్రారంభించారు. ఇంటింటికి కుళాయి వ్యవస్థ మరమ్మతు పనులను చేపట్టారు,పనులన్ని పూర్తవ్వడంతో మంగళవారం సోలార్ తాగునీటి పథకంను ఎంపీటీసీ ఈశ్వరరావు, సర్పంచ్ రాంబాబులు పునః ప్రారంభించడంతో సమస్య పరిష్కారమైంది.

టిప్పర్ బోల్తా: ముగ్గురికి గాయాలు



బోల్తా పడిన ఇసుక టిప్పర్

పాడేరు రూరల్: వనుగుపల్లి పంచాయతీ చింతగున్నల ఘాట్ రోడ్డులో మంగళవారం ఇసుక లోడుతో టిప్పర్ బోల్తా పడింది. ఇసుక లోడుతో చింతగున్నల వెళ్తున్న టిప్పర్ ఘాట్‌లోని మలుపు వద్ద అదుపు తప్పి పక్కనే ఉన్న లోయలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఒకరికి కాలు పూర్తిగా విరిగిపోగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన స్పందించి క్షతగాత్రులను పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేకశ్రద్ధ

గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు



వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్షిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు

పెదబయలు: పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యంపై పాఠశాల హెచ్‌ఎం, పాఠశాల వార్డన్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని గిరిజన సంక్షేమ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు సూచించారు.మంగళవారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల–1లో పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వార్డున్లు, గ్రామ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. రెండు మండలాల్లో అర్హత ఉండి ఉపకార వేతనాలు పొందని విద్యార్థులు 30 నుంచి 40 మంది ఉన్నారన్నారు. గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు నూరు శాతం అయ్యేలా కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన పథకాలకు అర్హత ఉండి పొందకపోతే నమోదు చేయాలని సూచించారు. ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున విద్యార్థులు అన్నిరంగాల్లో పోటీ పడేలా తయారు చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పదో తరగతితో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. అలాగే పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది వారి పరిధిలోని పాఠశాలల్లో వారం వారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని సూచించారు. పాఠశాలలో సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలల్లో నూరుశాతం హాజరు ఉండేలా హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలని కోరారు. ఆరోగ్యం బాగోలేని వారిని ఇళ్లకు పంపించకుండా ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందించాలన్నారు. సూపరింటెండెంట్ శ్రీనివాస రెడ్డి, పాఠశాల హెచ్‌ఎంలు, వార్డెన్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంచు దుప్పటి


లైట్ల వెలుగులో వాహనాల రాకపోకలు

పెదబయలు: మండలంలోని రెండు రోజుల నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 9.30 గంటల వరకు మంచు తెరలు వీడటం లేదు. వాహనాలు హెడ్ లైట్ల వెలుగులో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. చలి తీవ్రత కూడా పెరిగింది.

విశాఖ-కిరండూల్ రైలుకు మరో విస్టాడోమ్ కోచ్

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): అరకు వెళ్లే రైల్వే ప్రయాణికులు, పర్యాటకుల సౌకర్యార్థం ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖపట్నం-కిరండూల్-విశాఖపట్నం రైలుకు మరో విస్టాడోమ్ కోచ్‌ను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25, 27, 29, 31, ఫిబ్రవరి 2, 4, 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24 తేదీల్లో బయలుదేరే విశాఖపట్నం-కిరండూల్(08551)రైలుకు, కిరండూల్‌లో ఈ నెల 6, 8, 10, 12, 14, 16, 18, 20, 22, 24, 26, 28, 30, ఫిబ్రవరి 1, 3, 5, 7, 9, 11, 13, 15, 17, 19, 21, 23, 25 తేదీల్లో బయలుదేరే కిరండూల్-విశాఖపట్నం(08552)రైలుకు విస్టాడోమ్ కోచ్‌ను అదనంగా జత చేస్తున్నారు.

భగత్‌కి కోటి దారి మళ్లింపు

భోపాల్ డివిజన్ బినా-గుణ సెక్షన్ పరిధిలో జరుగుతున్న డబ్లింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే భగత్‌కి కోటి వీక్లీ ఎక్స్‌ప్రెస్‌ను ఆయా తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు డీసీఎం ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నంలో ఈ నెల 5, 12, 19 తేదీల్లో బయలుదేరే విశాఖపట్నం-భగత్ కి కోటి (18573) ఎక్స్‌ప్రెస్ వయా బినా మల్‌ఖెడి, బినా, సంత్ హిర్దరమ్ నగర్, నగడ, కోట జంక్షన్ల మీదుగా ప్రయాణిస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7, 14 తేదీల్లో భగత్‌కి కోటి -విశాఖపట్నం (18574) వయా కోట జంక్షన్, నగడ, సంత్ హిర్దరమ్ నగర్, బినా, బినా మల్‌ఖెడి స్టేషన్ల మీదుగా నడుస్తుంది.

కార్గోలో కొత్త పుంతలు!

- ప్రైవేటు లాజిస్టిక్స్‌తోనూ ఒప్పందాలు
- నరకు రవాణాలో ఆర్టీసీ జోన్-1 జోరు
- గత ఏడాది కంటే రూ.4.15 కోట్లు పెరిగిన ఆదాయం
- అన్ని ఆదాయ మార్గాలపైనా ఆర్టీసీ అధికారుల దృష్టి
- ఏటీబీ ఏజెంట్ల వ్యవస్థ మరింత విస్తృతం


విశాఖ ద్వారకా బస్‌స్టేషన్‌లో పార్సిల్ రవాణా కేంద్రం

సాక్షి, విశాఖపట్నం: కార్గో రవాణాలో ఆర్టీసీ ఊహించిన దానికంటే ఎక్కువ ఆదాయాన్ని ఆర్జిస్తోంది. ఇప్పటికే తక్కువ సమయంలో సరకులను, పార్సిళ్లను గమ్యానికి చేరుస్తూ వినియోగదారుల ఆదరణ చూరగొంటోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఈ సేవలను మరింతగా విస్తృతం చేసే దిశగా ఆలోచన చేస్తోంది. సరకు రవాణాలో ఆర్టీసీ జోన్-1 (పూర్వ విజయనగరం జోన్) జోరు మీద ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న ఈ జోన్‌లో 47 సరకు రవాణా వాహనాలున్నాయి. వీటిలో 17 కంటైనర్లు, 30 డీజీటీలు (డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు) ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ ఒక్క రోజు కూడా ఖాళీ లేకుండా తిరుగుతున్నాయి. ఇలా రోజు రోజుకు పెరుగుతున్న కార్గో రవాణాతో వీటి సంఖ్యను పెంచాలని ఆర్టీసీ అధికారులు యోచిస్తున్నారు. మరోవైపు కొత్తగా ప్రైవేటు లాజిస్టిక్స్ (పార్సిల్) సంస్థలతోనూ ఒప్పందాలు కుదుర్చుకునే దిశగా వీరు అడుగులు వేస్తున్నారు. ఇందుకోసం ఆయా సంస్థలకు అధీకృత ఏజెన్సీలను ఇస్తారు. ఆపై ఆ సంస్థలు బుక్ చేసిన సరకులను గాని, లేదా ఆ సంస్థలు రవాణా చేయగా మిగిలిన సరకులను గాని ఆర్టీసీ ద్వారా కూడా రవాణా చేసేలా చర్చిస్తున్నారు. బుకింగ్ చేసే వారి నుంచి ప్రైవేటు పార్సిల్ సంస్థలు వసూలు చేసే చార్జీతో ఆర్టీసీకి సంబంధం ఉండదు. ఆర్టీసీ నిర్దేశిత రవాణా చార్జీ చెల్లిస్తే చాలు గమ్యానికి చేరవేస్తారు. ప్రైవేటు పార్సిల్ సర్వీసులు సరకును గమ్యానికి చేర్చడానికి 3-4 రోజుల సమయం పడుతుంటే ఆర్టీసీ గరిష్టంగా 24-48 గంటల్లోపే ఆయా ప్రాంతాలకు చేరుస్తుంది. ఇలా ప్రైవేటు పార్సిల్ సంస్థల కంటే వేగంగా గమ్యాన్ని చేరుస్తుండడం తమకు కలిసొచ్చే అంశంగా ఆర్టీసీ అధికారులు భావిస్తున్నారు.

కొరియర్ సేవల్లో దూకుడు

ఆర్టీసీ కొరియర్ సేవలకు మరింత ఆదరణ లభిస్తోంది. పార్సిల్ కౌంటర్ నుంచి 10 కి.మీల పరిధిలో 50 కిలోల బరువు వరకు సరకు/కొరియర్ పార్సిళ్లను వినియోగదారుడు కోరుకున్న చిరునామాకు డోర్ డెలివరీ చేస్తున్నారు. వీటిలో వివిధ రకాల పార్సిళ్లతో పాటు బ్లడ్ శాంపిల్స్ డెంటల్ కిట్స్ వంటివి కూడా ఉంటున్నాయి. జోన్-1 నుంచి సిమెంట్, వైట్ సిమెంట్, హార్డ్‌వేర్, గృహావసర సరకులు, గోధుమపిండి, దుస్తులు, ఫ్లిప్‌కార్ట్ సరకులు, బిస్కెట్లు, విత్తనాలు, పుస్తకాలు, మందులు, బియ్యం, నూకలు, పాత టైర్లు వంటివి బుక్ అవుతున్నాయి. ఇంకా ఇల్లు మారాలనుకునే వారి సామగ్రి తరలింపును కూడా ఆర్టీసీ చేపట్టింది. ఇలా సరకు రవాణా ద్వారా 35 శాతం, పార్శిళ్ల ద్వారా 65 శాతం ఆదాయాన్ని ఆర్జిస్తోంది.

ఏటీబీ ఏజెంట్ల సంఖ్య పెంపు

మరోవైపు ఆర్టీసీ కార్గోకు పెరుగుతున్న ఆదరణతో ఆథరైజ్డ్ టికెట్ బుకింగ్ ఏజెంట్ల (ఏటీబీలు) వ్యవస్థను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం ఈ జోన్‌లో 60 మందికి పైగా ఏటీబీ ఏజెంట్లు ఉండగా ఆ సంఖ్యను 200 వరకు పెంచనున్నారు. ఈ ఏజెంట్లకు బుకింగ్ చార్జీలో 15 శాతం కమీషన్‌గా చెల్లిస్తారు. ఏటీబీ కోసం గ్రామీణ ప్రాంతంలో రూ.1000, అర్బన్‌లో రూ.5 వేల చొప్పున తిరిగి చెల్లించే పద్ధతిలో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఏటీబీ ఏజెన్సీలతో పాటు ఇంటి సామగ్రి తరలింపు కోసం 7331147260/7331147261/9346749365 నంబర్లకు సంప్రదించాలని ఆర్టీసీ జోనల్ అధికారులు కోరుతున్నారు.

రూ.4.15 కోట్ల పెరుగుదల

కార్గో రవాణాలో ఆర్టీసీ జోన్-1 గత ఏడాదికంటే మెరుగైన ఆదాయాన్ని సాధించింది. 2021 ఏప్రిల్ నుంచి డిసెంబర్‌కు ఈ జోన్ రూ.11.37 కోట్లు ఆర్జించగా, 2022 ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.15.52 కోట్లు సంపాదించింది. అంటే గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.15 కోట్ల ఆదాయం పెరిగిందన్న మాట! ఇలా 36 శాతానికి పైగా వృద్ధి కనిపించింది.

కార్గో వ్యవస్థ మరింత బలోపేతం



ఆర్టీసీ కార్గో రవాణాకు మంచి ఆదరణ లభిస్తోంది. దీంతో ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నాం. ఏటీబీ ఏజెన్సీలను విస్తృతం చేస్తాం. డిమాండ్‌కు అనుగుణంగా డీజీటీలు/కంటైనర్ వాహనాలను పెంచుతాం. డీజిల్ ధరలు గణనీయంగా పెరిగినా 2018లో నిర్దేశించిన రవాణా చార్జీలే వసూలు చేస్తున్నాం. ఈ జోన్‌లో గత ఏడాదితో పోల్చుకుంటే రూ.4.5 కోట్ల కార్గో ఆదాయం పెరిగింది. ప్రైవేటు కార్గో సంస్థలకంటే వేగంగా, సురక్షితంగా సరకులు, పార్శిళ్లను డెలివరీ ఇస్తున్నాం. త్వరలో ప్రైవేటు కార్గో సంస్థలకు ఆథరైజ్డ్ ఏజెన్సీలు ఇచ్చి వారి సరకును కూడా ఆర్టీసీ ద్వారా రవాణా చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.

–రవికుమార్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, జోన్-1

గర్భిణికి డోలీమోత


డోలీలో గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తున్న మహిళలు

పాడేరు రూరల్: పాడేరు మండల మారుమూల మోదాపల్లి పంచాయతీ కాంగెడ్డ గ్రామానికి చెందిన ఓ గర్భిణికు మంగళవారం ఉదయం పురిటి నొప్పులు అధికమైంది. దీంతో కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. అంబులెన్స్ సకాలంలో వచ్చినప్పటికీ కాంగెడ్డ గ్రామానికి సరైన దారి లేకపోవడంతో మూడు కిలోమీటర్ల దూరంలోనే అంబులెన్స్ నిలిపివేశారు. దీంతో గ్రామానికి చెందిన పలువురు మహిళలు డోలి కట్టి ఆమెను మూడు కిలో మీటర్ల మేర మోసుకు వచ్చారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు స్పందించి తన గ్రామానికి పక్కా రోడ్డు సౌకర్యం కల్పించాలని కాంగెడ్డ గిరిజనులు కోరుతున్నారు.

కాఫీ గిట్టుబాటు ధరలపై విస్తృత ప్రచారం


రైతులకు అవగాహన కల్పిస్తున్న కాఫీ లైజన్ వర్కర్లు

జి.మాడుగుల: గిరిజనులు పండిస్తున్న కాఫీ గింజలకు వ్యాపారులు గిట్టుబాటు ధర చెల్లించాలని మండల కేంద్రంలోని వారపు సంతలో ఐటీడీఏ కాఫీ లైజన్ వర్కర్లు మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. పాచిమెంట్ కాఫీ కిలో రూ.270 చెల్లించి కొనుగోలు చేయాలని, వ్యాపారులు ఎటువంటి మోసాలకు పాల్పడవద్దని సూచించారు. సంతల్లో కాఫీ రైతులు పాచిమెంట్ కాఫీ కిలో రూ.270 చెల్లించిన వారికే విక్రయించాలని సూచించారు. లైజన్ వర్కర్లు వెంకటరావు, ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జీడిమామిడి తోట దగ్ధం


దగ్ధమైన జీడిమామిడి మొక్కలు

మారేడుమిల్లి: వేటుకూరు వెళ్లే రహదారిలోని జీడిమామిడితోట మంగళవారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన పల్లాల రాజారెడ్డి అనే గిరిజనుడు స్థానిక వేటుకూరు గ్రామ సమీపంలో జీడిమామిడి, జాఫ్రా మొక్కలు వేశాడు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన సంఘటనలో 100 జీడిమామిడి మొక్కలు, 40 జాఫ్రా మొక్కలు దగ్ధమైనట్టు తోట యాజమాని రాజారెడ్డి తెలిపారు. ప్రమాదవశాత్తు తోట నిప్పు అంటుకుందా లేక ఎవరైనా కావాలనే నిప్పు పెట్టారని అనుమానాలు వ్యక్తమవుతున్నట్టు పేర్కొన్నారు. అధికారులకు ఫిర్యాదు చేశామని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

భూముల రీసర్వే పక్కాగా నిర్వహించాలి

సబ్ కలెక్టర్ అభిషేక్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్ ఆదేశాలు


ఐనాడలో భూముల రీసర్వేపై అవగాహన కల్పిస్తున్న సబ్ కలెక్టర్ అభిషేక్


జీకే వీధిలో సిబ్బందికి సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్

పాడేరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పక్కాగా నిర్వహించాలని పాడేరు సబ్ కలెక్టర్ వి.అభిషేక్ ఆదేశించారు. పాడేరు మండలం మారుమూల ఐనాడ గ్రామ పంచాయతీను ఆయన మంగళవారం సందర్శించారు. పంచాయతీలో జరుగుతున్న భూముల రీసర్వే విధానాన్ని పరిశీలించారు. సర్వే చేస్తున్న సర్వే, రెవెన్యూ శాఖ సిబ్బందికి పలు సలహాలు, సూచనలిచ్చారు. అనంతరం ఆయన పంచాయతీ పరిధిలోని రాయిపాలెం గ్రామంలో పాఠశాలను సందర్శించి విద్యార్థులకు తయారుచేసిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి తిని రుచి చుశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు ఆదేశించారు.

విద్యార్థులకు లెక్కలపై పలు ప్రశ్నలు వేసి వారి చేత గుణింతాలు, కూడికలు చేయించారు. గ్రామంలో నూతనంగా మంజూరైన లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును పంపిణీ చేశారు. పాడేరు ఇన్‌చార్జి తహసీల్దార్ త్రినాథ్‌నాయుడు, నాయకులు తదితరులున్నారు.

గూడెంకొత్తవీధి: ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో భూముల రీసర్వేను వేగవంతం చేయాలని అల్లూరి జిల్లా సంయుక్త కలెక్టర్ జె.శివ శ్రీనివాస్ అన్నారు. ఆయన మాట్లాడుతూ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సమావేశమయ్యారు. సర్వే జరుగుతున్న వివరాలను ఇన్‌చార్జి తహసీల్దారు రాజ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి తగాదాలు లేకుండా ఆరోపణలు రాకుండా సమగ్రంగా సర్వే చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఆర్‌ఐలు మహదేవ్, కామేశ్వరరావు, మండల సర్వేయర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు

తెగుళ్ల నివారణకు సూచనలు


దూగుట్టలో మిర్చి తోటను పరిశీలిస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేతలు

కూనవరం: మిర్చి పంటలను ఆశించే నల్ల తామర పురుగు నివారణకు అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత డాక్టర్ లలిత కామేశ్వరి, శాస్త్రవేత డాక్టర్ ఆదర్శి, 'సమగ్ర సస్యరక్షణ పరిశోధన (న్యూఢిల్లీ)కి చెందిన సైంటిస్ట్ నారాయణ బట్ సూచించారు. మండల పరిధిలోని దూగుట్ట గ్రామంలో నల్ల తామర ఆశించిన మిర్చి తోటలను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బవేరియా, బాసియాన, వెర్టిశీలియం, సిలికాన పద్ధతులను జీవ రసాయణాలను ఉపయోగించే పద్ధతులను రైతులకు వివరించారు. మండలంలో ఐదుగురు రైతుల పొలాలను సందర్శించి తెగుళ్లను అరికట్టేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. వీహెచ్‌ఏ సాయికిరణ్, 25 మంది రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు చినదొడ్డిగల్లు విద్యార్థులు

నక్కపల్లి: ఇటీవల నర్సీపట్నం మండలం వేములపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన బేస్ బాల్‌పోటీల్లో చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్- 17 విభాగంలో పదోతరగతి చదువుతున్న సాయి జ్యోతి, అండర్-14 బాలుర విభాగంలో 8వతరగతి చదువుతున్న ఎజిత్‌అఖిల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం అప్పారావు తెలిపారు.

పందెంరాయుళ్ల అరెస్టు

ఎస్.రాయవరం: కోడి పందాల స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం పెద ఉప్పలం గ్రామ శివారున పందాలు ఆడుతున్నారన్న సమాచారంతో దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వారి నుంచి 4 కోళ్లు, రూ.2,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కోడి పందాలు, పేకాట ఆడితే చర్యలు తప్పవని ఎస్‌ఐ ప్రసాదరావు హెచ్చరించారు.

స్పందన అర్జీలు తక్షణ పరిష్కారం

కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

రంపచోడవరం: స్పందన అర్జీలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరం నుంచి జిల్లాలోని అన్ని మండలాల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆయన మాట్లాడారు. స్పందనకు వచ్చిన అర్జీలు అప్‌లోడ్ చేసి సంబంధిత దరఖాస్తుదారునికి రశీదులు ఇవ్వాలన్నారు. ప్రతీ దరఖాస్తు పూర్తిగా పరిశీలించి సమస్యను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న పింఛన్ల దరఖాస్తులను ఎంపీడీవోలు, కోఆర్డినేటర్ల నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు. రేషన్ కార్డులు పెండింగ్‌లో ఉన్న వాటిని పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామ సచివాలయాల సిబ్బంది, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆశ్రమ పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎంపీడీవోల ఆధ్వర్యంలో మహిళా పోలీసులు పనిచేయాలని సూచించారు. మండల కేంద్రాలు, లింక్ రోడ్లు, టూరిజం ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ఎప్పటికప్పుడు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది విధులకు వచ్చినప్పుడు, వెళ్లేటప్పుడు బయోమెట్రిక్ హాజరు వేయడం తప్పనిసరి అన్నారు. మహిళా పోలీసులు పాఠశాలను సందర్శించినప్పుడు విజిట్ రాయాలని ఆదేశించారు. రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, సచివాలయాల భవన నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. పీవో సూరజ్ గనోరే , చింతూరు సబ్ కలెక్టర్ పర్మస్ అహ్మద్‌ఖాన్, డీపీవో కొండలరావు, హౌసింగ్ పీడీ బాలునాయక్ ఈఈ డేవిడ్‌రాజు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకే కాఫీ కొనుగోలు

- తక్కువకు కొనుగోలుపై విచారణ చేస్తాం
- పాడేరు జీసీసీ డీఎం పార్వతమ్మ

పెదబయలు: ప్రభుత్వ ఆదేశాల మేరకు గిరిజన రైతులు పండించిన కాఫీ గిట్టుబాటు ధరతోనే కొనుగోలు చేయాలని జీసీసీ డివిజనల్ మేనేజరు కె. పార్వతమ్మ సూచించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో 'తక్కువ ధరతో జీసీసీ కాఫీ కొనుగోలు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆమె స్పందించారు. ఈ ఏడాది కాఫీకి మరింత గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించిందన్నారు. గ్రామాల్లోకి వెళ్లి రైతుల నుంచి కొనుగోలు చేయడమే కాకుండా వారి బ్యాంకు ఖాతాల్లో 24 గంటల్లో డబ్బులు జమచేస్తున్నట్టు చెప్పారు. రైతులు బాగా ఎండబెట్టిన గింజల్లో 10 శాతం తేమ ఉంటే కిలో రూ.270, బాగా ఎండబెట్టిన అరబిక్ చెర్రిలో తేమ శాతం 11 ఉంటే రూ.135 ధరతో కొనుగోలు చేస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా పెదబయలు జీసీసీ మేనేజరు కాఫీ గింజల్లో తేమ 10 శాతం తక్కువగా ఉన్నందున తక్కువ ధర చెల్లించామని వివరణ ఇవ్వడం విరుద్ధమన్నారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని డీఎం స్పష్టం చేశారు. కాఫీ రైతులు బాగా ఎండించి మంచి మద్దతు ధర పొందాలని, తక్కువ మాయిచిరితో అమ్మకానికి తెచ్చి నష్టపోవద్దని ఆమె కోరారు.

గ్రామాల్లో పక్కాగా సర్వే

- క్షయపై అవగాహన కల్పించాలి
- టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ శివకుమార్


గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ శివకుమార్, బృంద సభ్యులు

హుకుంపేట: గ్రామాల్లో క్షయవ్యాధి గ్రస్తులను గుర్తించే సర్వే పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర టీబీ కంట్రోల్ అధికారి డాక్టర్ శివకుమార్ ఆదేశించారు. మండలంలోని ఉప్ప, హుకుంపేట ఆస్పత్రిల్లో ఆశ కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. అనంతరం లివిటి, సంతారి గ్రామాల్లో సిబ్బంది నిర్వహించే సర్వేలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారాల తరబడి దగ్గు ఉన్నా, టీబీ లక్షణాలున్నా వెంటనే గుర్తించి ఆస్పత్రికి తరలించి ప్రత్యేక పరీక్షలు చేయాలని సిబ్బందికి సూచించారు. క్షయపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. రోగులకు మందులు, పౌష్టికాహారం సక్రమంగా అందించాలన్నారు. టీబీ జిల్లా అధికారి విశ్వేశ్వరనాయుడు, విఘ్నేష్, శ్రీనివాసరావు, సదానందం తదితరులున్నారు.

ఆర్‌బీకేల్లో మందుల నిల్వలు

పశుసంవర్థకశాఖ జేడీ వెంకటేశ్వర్లు ఆదేశం

హుకుంపేట: రైతుభరోసా కేంద్రాల్లో మందులు నిల్వలు ఉండేటట్లు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్థకశాఖ జేడీ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం మండలంలోని మఠం, గూడ, సన్యసమ్మపాలెం, హుకుంపేట రైతు భరోసా కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతీ విషయాన్ని అయన క్షుణ్ణంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బంది హాజరు, పనితీరు వివరాలపై ఆరా తీశారు. గిరిజన ప్రాంతంలో పశువులకు ఎటువంటి సమస్యలు వచ్చినా దగ్గరలో ఉన్న రైతు భరోసా కేంద్రాలకు సమాచారం అందించాలని ఆయన సూచించారు. కాలానుగుణంగా వస్తున్న వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉంటూ అవసరమైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు.

అల్లం, ఉసిరి ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన


అల్లం, ఉసిరి ఉత్పత్తుల మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్న నాబార్డు డీజీఎం శ్రీనివాసరావు

జి.మాడుగుల: మండలంలోని కె.కోడాపల్లి పంచాయతీ నిట్టమామిడి గ్రామంలో స్మైల్ స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో డ్వాక్రా సంఘ మహిళలకు నాబార్డు ఆర్థిక సహాయంతో మైక్రో ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాం(ఎంఈడీపీ) కింద అల్లం, ఉసిరి విలువ హెచ్చింపుపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ శిక్షణలో నాబార్డు డీజీఎం ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు పండిస్తున్న అల్లం, ఉసిరి పంటలు నేరుగా విక్రయించకుండా దాని విలువ ద్వారా ఆదాయం రెట్టింపు చేసుకోవడమే కాక నిలువ చేసుకొని మార్కెట్ చేసుకునే అంశాలను వివరించారు. మహిళా సంఘాలకు బ్యాంకు ద్వారా రుణాల సదుపాయం కల్పించడం వలన ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించవచ్చన్నారు. సీజన్‌లో లభించే ఉత్పత్తుల్లో కొంత పంట ఉత్పత్తులను అమ్ముకొని మరి కొంత ఉత్పత్తులు నిల్వ చేసుకొని ధరలు పెరిగినపుడు విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అల్లంతో శొంటి, అల్లం కేండి, పౌడర్, అల్లం పేస్టు, పచ్చడి వంటి ఉత్పత్తులు, ఉసిరి ద్వారా ఉసిరి పొడి, డ్రైఆమ్లా, పచ్చడి కేండీ, మురబ్బా వంటి ఉత్పత్తులు తయారీ చేసి వాటి మార్కెటింగ్ చేసుకొనే విధానాన్ని ఆయన వివరించారు. స్మైల్ సంస్థ కో-ఆర్డినేటర్ రవికుమార్ ఎఫ్‌పీవోల ద్వారా తయారీ ఉత్పత్తుల మార్కెటింగ్ విధానంపై అవగాహన కల్పించారు. శిక్షణ బుధవారంతో పూర్తి కావస్తుంది.స్మైల్ రిసోర్స్ పర్సన్ చిన్నమ్మి, బాలకృష్ణ, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

రావికమతం: సారా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసి, 10 లీటర్లు స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. పిల్లవానిపాలెంలో సారా విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసినట్టు చెప్పారు. మలిచెట్ల రాము అనే వ్యక్తిని అరెస్ట్ చేసి, కోర్టుకు తరలించినట్టు తెలిపారు.